సాక్షి అనంతపురం

శుక్రవారం, 6, జూన్, 2025



టన్ను చీనీ రూ.31,770

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.31,770 ప్రకారం ధర పలికాయి.



అన్నదాతకు రిక్తహస్తం

'అన్నదాత సుఖీభవ' లబ్ధి పొందే విషయంలో సవాలక్ష నిబంధనలు విధించడంతో అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు. 10లో

గరిష్టం/కనిష్టం
37.7°/22.8°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

విత్తన వేరుశనగ నాణ్యతగా లేకుంటే వెనక్కివ్వండి



రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ బస్తాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ఆత్మకూరు: విత్తన వేరుశనగ నాణ్యతగా లేకుంటే వెనక్కివ్వాలని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలోని పంపనూరు రైతు సేవా కేంద్రం వద్ద ఎమ్మెల్యే సునీతతో కలిసి విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విత్తన వేరుశనగ లోడ్‌లను వ్యవసాయ సిబ్బంది తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. నాణ్యతగా లేకుంటే వెనక్కు పంపాలని సూచించారు. ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ రైతులు విత్తన వేరుశనగ బస్తాలను పరిశీలించి తీసుకోవాలని, నాణ్యతగా లేకపోతే వెనక్కి ఇవ్వాలని సూచించారు. జిల్లాకు విత్తన వేరుశనగ కేటాయింపు తక్కువగా ఉందని, రైతుల నుంచి డిమాండ్ దృష్ట్యా ఎక్కువ విత్తనం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఆర్డీఓ కేశవనాయుడు, ఎస్‌డీసీ రామ్మోహన్, ఏడీఏ రవి, ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏఈఓ సుజిత పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పంపనూరు నగర వనంలో ఎమ్మెల్యే సునీతతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలన్నారు. కార్యక్రమంలో సీఎఫ్ఓ యశోదబాబు, డీఆర్ఓ మలోల, తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పంచివ్వలేదని తల్లిపై దాడి

పెద్దపప్పూరు: ఆస్తిలో వాటా పంచలేదనే కోపంతో తల్లిపై తనయుడు దాడి చేసిన సంఘటన పెద్దపప్పూరు మండలం గార్లదిన్నెలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గార్లదిన్నెకు చెందిన సరస్వతికి శ్రీకాంత్ రెడ్డి, గోపాల్, వేణు సంతానం. గురువారం రెండో కుమారుడైన శ్రీకాంత్ రెడ్డి తనకు ఆస్తి పంచిలేదంటూ తల్లి సరస్వతితో ఘర్షణకు దిగాడు. తల్లిపై చేయి చేసుకున్నాడు. దీంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ క్రమంలో సరస్వతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు శ్రీకాంత్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

బీటెక్ ఫలితాల విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో బీటెక్ ఫలితాలు విడుదలయ్యాయి. ఏప్రిల్‌లో నిర్వహించిన బీటెక్ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–23) రెగ్యులర్, (ఆర్–20), (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ, రెండో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–23), (ఆర్–20), (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి.నాగప్రసాద్ నాయుడు గురువారం విడుదల చేశారు. ఫలితాల కోసం జేఎన్‌టీయూ (ఏ) వెబ్‌సైట్ చూడాలని కోరారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టెలో పడి బాలుడి మృతి



అరుణ్‌దీప్ మృతదేహం

పెద్దవడుగూరు: నీటి తొట్టెలో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చిత్రచేడు గ్రామంలో జరిగింది. వివరాలు.. చిత్రచేడుకు చెందిన అరుణ, ఆనంద్ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడైన ఏడాదిన్నర వయసున్న అరుణ్ దీప్ గురువారం ఆడుకొంటూ ఇంట్లోంచి బయటకు వచ్చాడు. తర్వాత ఎంత సేపటికీ లోపలికి వెళ్లలేదు. ఈ క్రమంలోనే కుటుంబసభ్యులు బయటకు రాగా.. నీటి తొట్టెలో అరుణ్ దీప్ అచేతన స్థితిలో కనిపించాడు. బయటకు తీసి వెంటనే పెద్దవడుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అరుణ్ దీప్ మృతి చెందినట్లు నిర్ధారించారు.

దగ్గుపాటిపై తిరుగుబావుటా

అనంత టీడీపీలో తారస్థాయికి కుమ్ములాటలు

- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా గళం విప్పుతున్న ముఖ్య నాయకులు
- ఇటీవల 'మినీ మహానాడు'లో పురుగుల మందు తాగిన వెంకటేశులు
- ఎమ్మెల్యేతో ప్రాణహాని ఉందని సుధాకర్ నాయుడు ఎస్పీకి ఫిర్యాదు
- తొలినుంచీ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి వేరుకుంపటి
- ఎమ్మెల్యే దగ్గుపాటిపై అధిష్టానానికి ఫిర్యాదుల వెల్లువ



మినీ మహానాడులో పురుగుల మందు తాగిన సాకే వెంకటేష్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్)



ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం అర్బన్ నియోజకవర్గ టీడీపీలో కుమ్ములాటలు తారస్థాయికి చేరాయి. రాష్ట్రంలో కూటమి పాలనా పగ్గాలు చేపట్టి మరో వారానికి ఏడాదవుతుంది. ఇంతలోనే 'తెలుగు తమ్ముళ్ల డిష్యుం..డిష్యుం' విస్మయం కలిగిస్తోంది. తొలిసారి ఎమ్మెల్యే అయిన దగ్గుపాటి ప్రసాద్ వ్యవహారాలతో రోజుకో నేత విభేదిస్తున్నారు. దీంతో ఇప్పుడు అనంతపురం అర్బన్ నియోజకవర్గం అభివృద్ధికి దూరమై గ్రూపులతో అట్టుడుకుతోంది.

మొన్న వెంకటేశులు.. నిన్న చంటి

ఎమ్మెల్యే, ఆయన అనుచరుల తీరుపై అర్బన్ నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేతలు ఒక్కొక్కరిగా విభేదిస్తూ దూరమవుతున్నారు. మొన్నటికి మొన్న మినీ మహానాడులో తనను ఎమ్మెల్యే పూర్తిగా విస్మరించారని ఆవేదన వ్యక్తం చేస్తూ సాకే వెంకటేశులు అనే వ్యక్తి పురుగుల మందు తాగారు. ఇప్పటికీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిన్నటికి నిన్న ఎమ్మెల్యే అనుచరులు తన ఇళ్లు కూల్చడానికి వచ్చారంటూ చంటి అనే టీడీపీ ముఖ్య నేత పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. అధిష్టానం జోక్యం చేసుకోవడంతో ఈ వివాదం సద్దుమణిగింది.

సుధాకర్‌నాయుడు ఫిర్యాదు కలకలం..

మొదటినుంచి అనంతపురం అర్బన్‌లో టీడీపీ నేతగా సుధాకర్‌నాయుడుకు పేరుంది. ఈయన్ని లిక్కర్ సుధాకర్ అనికూడా అంటారు. గత కొంత కాలంగా సుధాకర్‌కు ఎమ్మెల్యేతో విభేదాలు నెలకొన్నాయి. జిల్లా పార్టీ పరిశీలకులు కోవెలమూడు రవీంద్ర (నాని) పంచాయితీ చేసినా రాజీ కుదరలేదు. ఈ క్రమంలోనే.. తనకు ఎమ్మెల్యే అనుచరుల నుంచి ప్రాణహాని ఉందంటూ రెండు రోజుల క్రితం ఉన్నట్టుండి భార్యతో కలిసి ఎస్పీకి సుధాకర్ ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. టీడీపీకి తొలి నుంచి విధేయుడిగా ఉన్న సుధాకర్‌కే ఈ పరిస్థితి ఉంటే భవిష్యత్తులో తమ పరిస్థితి ఎలా ఉంటుందో అంటూ మిగతా కేడర్‌లో భయం మొదలైనట్లు తెలిసింది. ఇదిలా ఉండగా గురువారం అధిష్టానం నుంచి పిలుపు రావడంతో సుధాకర్‌నాయుడు, ఎమ్మెల్యే దగ్గుపాటి విజయవాడ వెళ్లివచ్చారు. ఈ క్రమంలోనే రాత్రి సుధాకర్ నాయుడు అనంతపురం డీఎస్పీని కలవడం చర్చనీయాంశమైంది.

తొలి నుంచీ ప్రభాకర్ చౌదరి వేరుకుంపటి..

గత సార్వత్రిక ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి అనంతపురం టీడీపీ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఆయన ఎమ్మెల్యే దగ్గుపాటికి వ్యతిరేకంగా వేరుకుంపటి పెట్టి నడిపిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేపై అధిష్టానానికి ఫిర్యాదులు చేస్తున్నారు. నియోజకవర్గంలో కబ్జాలు, మద్యం వంటి వాటిపై ఆధారాలతో సహా తెలియజేస్తున్నారు. దీంతో దగ్గుపాటి ప్రసాద్ రాజకీయంగా ఏకాకి అయ్యారని అంటున్నారు. పాలన చేపట్టి ఏడాది గడవకముందే తీవ్ర వ్యతిరేకత తెచ్చుకున్నారని టీడీపీ నాయకుల్లోనే చర్చ జరుగుతోంది.

హత్యకు పన్నాగం

సుధాకర్ నాయుడు హత్యకు అదే పార్టీకి చెందిన మరోవర్గం పన్నాగం పన్నినట్టు తెలుస్తోంది. తన వర్గం వారిని కావాలనే వేధిస్తున్నారని సుధాకర్ నాయుడు ఎమ్మెల్యేను ప్రశ్నించడం మొదలు పెట్టడం, వైన్‌షాపుల వ్యవహారాల్లో తేడా రావడంతో హత్య చేయాలని భావించారనే అనుమానాలు కలుగుతున్నాయి. ఎమ్మెల్యే అనుచరుల్లో ఇద్దరు ఈ దురాగతానికి యత్నించినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేకు అడుగడుగునా అడ్డు తగులుతున్నాడనే ఉద్దేశంతోనే అతన్ని అడ్డు తొలగించుకోవాలని చూస్తున్నట్టు సమాచారం. టీడీపీలోనే ఓ వర్గం నాయకుణ్ని మరో వర్గం నాయకులు చంపడానికి యత్నించడమనేది ఇప్పుడు జిల్లాలో కలకలం రేపుతోంది. దీనిపై పోలీసులు ఎలా వ్యవహరిస్తారో వేచి చూడాల్సి ఉంది.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవనాల్లో శుక్రవారం నిర్వహించనున్నట్లు సీఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన స్థాయీ సంఘం–1, 2, 4, 7(ఆర్థిక, ప్రణాళిక/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు ప్రధాన సమావేశ భవన్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. అదనపు సమావేశ భవన్‌లో స్థాయీ సంఘం–3, 5, 6(వ్యవసాయం/ఐసీడీఎస్/సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు ఆయా సంఘాల చైర్‌పర్సన్ల అధ్యక్షతన ప్రారంభమవుతాయని వివరించారు. గత సమావేశాల్లో ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు సంబంధించిన వివరాలపై సమగ్ర సమాచారంతో అధికారులు హాజరు కావాలని సూచించారు.

- స్థాయీ సంఘ సమావేశాల్లో ఐసీడీఎస్‌లో పోషణ్ పక్వాడా నిర్వహణకు మంజూరైన నిధులు రూ.5 లక్షలు ఖర్చు పెట్టకుండా సీడీపీఓలు వాడుకోవడం, ఐఎస్ఓ ప్రమాణాలకు అనుగుణంగా కార్పొరేట్ హంగులతో కార్యాలయాలు ఉండాలన్న కలెక్టర్ వినోద్‌కుమార్ ఆశయం మేరకు ఐసీడీఎస్‌లో రూ.5 కోట్లతో ఆధునికీకరించిన వాటిని అర్నెల్లకే పీకి పడేయడంపై సభ్యులు చర్చించే అవకాశం ఉంది. ముంగారు సేద్యాలు మొదలైన కారణంగా ఇప్పటి వరకు విత్తనాలు, ఎరువుల ఊసే లేకపోవడం, పంట రుణాల రెన్యువల్, కొత్త రుణాల మంజూరు అంశాలపై సభ్యులు ప్రశ్నలు సంధించే పరిస్థితి ఉంది. కరోనా మళ్లీ కోరలు చాస్తున్న తరుణంలో వైద్య ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు తీసుకోవడంలో శ్రద్ధ పెట్టకపోవడంపైనా నిలదీసే పరిస్థితి కనిపిస్తోంది. విద్యా సంవత్సరం పునః ప్రారంభం కానుండడంతో పుస్తకాల సరఫరాతో పాటు ముఖ్యంగా గురుకుల పాఠశాలల్లో సీట్ల సంఖ్యను పెంచే అంశంపైనా ప్రధానంగా చర్చించనున్నట్లు సమాచారం.

నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

- జిల్లా పరిశీలకులుగా జేడీ సుబ్బారావు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం ఎడ్యుకేషన్: నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి జిల్లాలో 8 కేంద్రాలు, బెంగళూరులో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. రోజూ రెండు విడతలుగా ఈనెల 30 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. డీఈఓ పరిధిలోని కేంద్రాలకు పరిశీలకులుగా జాయింట్ డైరెక్టర్ సుబ్బారావును నియమించారు. పరీక్షలయ్యేదాకా ఆయన ఇక్కడే ఉంటూ కేంద్రాలను పరిశీలించనున్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. అన్ని కేంద్రాలకు డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. అభ్యర్థులు గంటన్నర ముందే కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.

డీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

అనంతపురం అర్బన్: డీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏడు కేంద్రాల్లో శుక్రవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. నగరంలో ఏడు కేంద్రాలు, గుత్తి, తాడిపత్రి పట్టణాల్లో ఒక్కో కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. రెండు సెషన్లుగా పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. డీఎస్సీ నిర్వహణకు జిల్లా రెవెన్యూ అధికారి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారన్నారు. కేంద్రానికి ఒకరు చొప్పున ఏడు కేంద్రాలకు డిప్యూటీ కలెక్టర్లను ఇన్‌చార్జ్‌లుగా నియమించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. డిప్యూటీ కలెక్టర్లు రోజూ పరీక్ష కేంద్రాలు తనిఖీ చేయాలని చెప్పారు. తాను కూడా పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానన్నారు. ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎ.మలోల, డీఎస్పీ వెంకటేషులు, డీఈఓ ప్రసాద్‌బాబు, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు

రంగయ్య పాదయాత్రపై కూటమి కుట్రలు

- టీడీపీ శ్రేణులను ఉసిగొల్పిన ఎమ్మెల్యే అమిలినేని వర్గీయులు
- బైకుకు రూ.200 పెట్రోల్... 'తమ్ముళ్ల'కు క్వార్టర్ బాటిల్ సరఫరా
- రోడ్డుపై బైఠాయించి హల్‌చల్ చేసిన 'పచ్చ' పార్టీ కార్యకర్తలు



మాజీ ఎంపీ తలారి రంగయ్య, వైఎస్సార్ సీపీ నేత ఉమాకు స్వాగతం పలుకుతున్న గ్రామీణులు



రంగయ్య పాదయాత్రకు వెళ్లకుండా వైఎస్సార్ సీపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

కళ్యాణదుర్గం: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, పీఏసీ సభ్యులు డాక్టర్ తలారి రంగయ్య చేపట్టిన 'ఆర్డీటీ పరిరక్షణ మహా పాదయాత్ర'ను అడ్డుకునేందుకు టీడీపీ నాయకులు కుట్రలకు తెరలేపారు. గురువారం ఉదయం బ్రహ్మసముద్రం మండలం కుర్లగుండ గ్రామంలో మొదలైన పాదయాత్ర మధ్యాహ్నానికి బొమ్మగానిపల్లి తండాకు చేరుకుంది. అక్కడి నుంచి బొమ్మగానిపల్లి చేరుకుని సాయంత్రం 4 గంటలకు పాదయాత్ర తిరిగి కొనసాగాల్సి ఉంది.

తమ్ముళ్లను ఉసిగొల్పిన వైనం..

రంగయ్య పాదయాత్ర టీడీపీ స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఆయనయ వర్గీయులకు మింగుడు పడటం లేదు. పాదయాత్రను కొనసాగిస్తే నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మరింత బలపడుతుందని భయపడిన వారు యాత్రను అడ్డుకునేందుకు మాస్టర్ ప్లాన్ వేశారు. తమ పార్టీ కార్యకర్తలను ఉసిగొల్పారు. గురువారం బ్రహ్మసముద్రం మండలం బొమ్మగానిపల్లి నుంచి పాదయాత్ర సాగాల్సిన రాయలదొడ్డి రహదారిపై 'పచ్చ' పార్టీ కార్యకర్తలు బైఠాయించారు. గో బ్యాక్ రంగయ్య అంటూ నినాదాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టారు. కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ కార్యకర్తలు అక్కడికి వచ్చేందుకు ఒక్కో బైకుకు రూ.200 పెట్రోల్ వేయించడంతో పాటు క్వార్టర్ బాటిల్ సరఫరా చేసినట్లు తెలిసింది.

భారీగా మోహరించిన పోలీసులు

పాదయాత్రను అడ్డుకోవాలని కుట్ర పన్నిన టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో బొమ్మగానిపల్లికి చేరుకోవడంతో పోలీసు బలగాలు గ్రామానికి తరలి వచ్చాయి. సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, స్పెషల్ పార్టీ సిబ్బంది పెద్ద సంఖ్యలో గ్రామంలో మోహరించారు. రంగయ్య శాంతియుత పాదయాత్రకు బుధవారం ఆటంకం కలిగించిన పోలీసుల తీరుతో వైఎస్సార్ సీపీ శ్రేణులు, ఆర్డీటీ లబ్ధిదారులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలోనే టీడీపీ శ్రేణులూ రావడంతో బొమ్మగానిపల్లిలో సుమారు 8 గంటల పాటు టెన్షన్ వాతావరణం నెలకొంది.

ప్రయాణికులకు కష్టాలు..

మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్రను అడ్డుకోవడానికి వచ్చిన టీడీపీ శ్రేణుల అత్యుత్సాహంతో సామాన్య ప్రయాణికులకు కష్టాలు తప్పలేదు. సాయంత్రం బొమ్మగానిపల్లి మీదుగా బుడిమేపల్లికి వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సుకు 'పచ్చ' పార్టీ కార్యకర్తలు అడ్డంగా బైఠాయించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. పోలీసులు జోక్యం చేసుకుని అరగంట తర్వాత బస్సును పంపించివేశారు. అదేవిధంగా కన్నేపల్లి, రాయలదొడ్డికి వెళ్లే వాహనదారులను సైతం వదలకపోవడంతో తీవ్ర అవస్థలు పడ్డారు.

ఎస్‌ఏ పదోన్నతులకు సర్టిఫికెట్ల పరిశీలన

- నేడు మండల పరిషత్ పాఠశాలల టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో భాగంగా ఎస్జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు గురువారం సర్టిఫికెట్ల పరిశీలన జరిగింది. స్థానిక శారదా నగరపాలక ఉన్నత పాఠశాలలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, మునిసిపల్, మునిసిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలల టీచర్లు హాజరయ్యారు. ఒక్కో పోస్టుకు ఇద్దరు చొప్పున 1:2 ప్రకారం సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచామని విద్యాశాఖ అధికారులు చెప్పినా... మొత్తం 382 పోస్టులు ఖాళీలుంటే, 372 మంది ఎస్జీటీలు రావడం విశేషం.

యాజమాన్యాల వారీగా పరిశీలిస్తే...

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సబ్జెక్టులకు కలిపి 26 ఖాళీలుంటే 21 మంది ఎస్జీటీలు, మునిసిపల్ పాఠశాలల్లో 304 ఖాళీలుంటే 300 మంది, మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలల్లో 52 ఖాళీలుంటే 52 మంది హాజరయ్యారు. శుక్రవారం మండల పరిషత్ పాఠశాలల టీచర్లకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. జిల్లాపరిషత్ స్కూళ్లలో అన్ని సబ్జెక్టులకు కలిపి 350 దాకా ఖాళీలున్నట్లు లెక్కలు తేల్చారు. మండల్ పరిషత్ టీచర్లతో పాటు ప్రభుత్వ, మునిసిపల్, కార్పొరేషన్ టీచర్లకు శుక్రవారం కూడా సర్టిఫికెట్ల పరిశీలనకు అవకాశం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

బదిలీ ఉత్తర్వుల కోసం స్కూల్ అసిస్టెంట్లు ఎదుచూపు

బదిలీల ఉత్తర్వుల కోసం స్కూల్ అసిస్టెంట్లు ఉదయం నుంచి ఎదురుచూశారు. ముందురోజే ఆప్షన్ల ప్రక్రియ పూర్తయింది. ఆ వెంటనే ఆర్డర్స్ జనరేట్ అవుతాయని అధికారులు ప్రకటించారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రిదాకా వేలాది మంది టీచర్లు బదిలీ ఉత్తర్వులు కోసం ఎదురుచూశారు. తరచూ సెల్‌ఫోన్లు చూసుకోవడం, డీఈఓ కార్యాలయ సిబ్బందిని ఆరా తీయడం, ఉపాధ్యాయ సంఘాల నాయకులను వాకబు చేయడం, రాష్ట్రంలోని సంఘాల నాయకులను ఆరా తీయడం కనిపించింది. అర్ధరాత్రి దాటిన తర్వాత జనరేట్ అయ్యే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పదోన్నతి పంచాయితీ

ఇటీవల జరిగిన హెచ్‌ఎం పదోన్నతుల్లో నాట్ ఆప్టెడ్ (ప్రస్తుతం పదోన్నతి ఇష్టం లేదు) ఇచ్చిన ఓ స్కూల్ అసిస్టెంట్ ఇప్పుడు పదోన్నతి కావాలని అడుగుతున్నాడు. ఈ విషయం విద్యాశాఖలో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. వివరాలు.. స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్‌ఎం పదోన్నతులకు ఇటీవల కౌన్సెలింగ్ నిర్వహించారు. ధర్మవరం మునిసిపల్ బాలికల పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఓ టీచరు... పదోన్నతి జాబితాలో ఉన్నాడు. వాస్తవానికి ఇదే స్కూల్‌లో హెచ్‌ఎం పోస్టు ఖాళీ ఉంది. తాను హెచ్‌ఎం పదోన్నతి తీసుకుని ఇదే స్కూల్‌కు రావాలని ఆయన భావించాడు. అయితే, సీనియార్టీ జాబితాలో ఈయనకంటే ముందు మరో ఇద్దరు టీచర్లు ఉన్నారు. సదరు టీచరు కౌన్సెలింగ్‌కు హాజరైనప్పుడు ధర్మవరం బాలికల పాఠశాల పోస్టు ఖాళీగానే ఉంది. నిబంధనల ప్రకారం 50 ఏళ్లు దాటిన పురుష టీచరు బాలికల పాఠశాల కోరుకున్నా... ఆయన వెనక (చివరిస్థానంలో ఉన్నాసరే) ఉన్న మహిళా టీచరు సదరు బాలికల పాఠశాల కోరుకుంటే ఆయన వెనక్కు రావాల్సిందే. ఆ సమయంలో మిగులుగా ఉన్న స్కూళ్లకు కేటాయిస్తారు. ఇదే విషయాన్ని సదరు టీచరుకు అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఆయన పదోన్నతి వద్దని ఆప్షన్ ఇచ్చాడు. ఈ క్రమంలో సీనియార్టీ జాబితాలో ఆ టీచరు వెనుక మరో ఇద్దరు టీచర్లు ఉన్నారు. అక్కడితో ఖాళీలన్నీ పూర్తవుతాయి. ఇద్దరూ పదోన్నతి పొందారు. పురుష టీచరు తీసుకోకపోవడంతో సీనియార్టీ జాబితాలోని మూడో టీచరుకు అవకాశం కల్పించారు. తాజాగా నాట్ ఆప్టెడ్ ఇచ్చిన సదరు టీచరు రంగంలోకి దిగి డీఈఓపై ఉన్నతాధికారులతో ఒత్తిళ్లు చేయించినట్లు తెలిసింది. దిక్కు తెలీని అధికారులు... ఆయన పదోన్నతి తీసుకున్న ముగ్గురు టీచర్లను పిలిపించి చివరి టీచరు రివర్షన్ వెళ్లాలని సూచించారు. ఇందుకు సదరు టీచరు ససేమిరా అంటుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

మొత్తం 4,589 మంది దరఖాస్తు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 4,589 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకుని వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో 2,456 మంది తప్పనిసరి, 2,133 మంది టీచర్లు రిక్వెస్ట్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. సబ్జెక్టుల వారీగా పరిశీలిస్తే..., బయలాజికల్ సైన్స్ 631 మంది, ఇంగ్లిష్ 656, హిందీ 383 మంది, కన్నడ ముగ్గురు, గణితం 847 మంది, పీడీలు 262 మంది, ఫిజికల్ సైన్స్ 616 మంది, సంస్కృతం ఏడుగురు, సోషల్ 544 మంది, స్పెషల్ ఎడ్యుకేషన్ 37 మంది, తెలుగు 584 మంది, ఉర్దూ 19 మంది దరఖాస్తు చేసుకున్నారు.

9న 'షైనింగ్ స్టార్స్'

- జిల్లావ్యాప్తంగా 222 మంది 'పది' విద్యార్థుల ఎంపిక
- ఒక్కో విద్యార్థికి రూ.20 వేల చొప్పున నగదు పురస్కారం

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల కోసం 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమం చేపడుతోంది. జిల్లాకు సంబంధించి ఈనెల 9న ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 187 మంది పదో తరగతి విద్యార్థులు, 35 మంది ఇంటర్ విద్యార్థులు కలిపి మొత్తం 222 మందిని ఎంపిక చేశారు. ఒక్కో విద్యార్థికి రూ. 20 వేల చొప్పున నగదు పురస్కారం అందించనున్నారు. ఆయా విద్యార్థులు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. 'షైనింగ్ స్టార్స్' కార్యక్రమానికి అందరూ సహకరించి విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. ప్రసాద్ బాబు, ఆర్ఐఓ వెంకటరమణనాయక్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందు నాయక్ విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

బిందెల షెడ్డులో అగ్ని ప్రమాదం



బిందెల షెడ్డులో ఎగిసి పడుతున్న మంటలు

గుత్తి: మండలంలోని బాచుపల్లి జంగాల కాలనీలో నివాసముంటున్న జంగాల పుల్లయ్యకు చెందిన బిందెల షెడ్డులో బుధవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షెడ్డులో ఉంచిన చిన్న గ్యాస్ సిలిండర్ ప్రమాదవశాత్తు పేలింది. దీంతో మంటలు చెలరేగాయి. షెడ్డు లోపల ఉంచిన బైక్, బిందెలతో పాటు కోళ్లు కాలిపోయాయి. అర్ధరాత్రి కావడంతో మంటలు ఆర్పడం సాధ్యం కాలేదు. దీంతో రూ.5 లక్షలు వరకు నష్ట పోయినట్లు బాధితుడు వాపోయాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'కౌలు రైతుల సమస్యలు పరిష్కరించండి'



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం నాయకులు

వజ్రకరూరు: ఆత్మహత్యలు చేసుకున్న కౌలు రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.10 లక్షల పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ వజ్రకరూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ... కౌలు రైతులు గుత్తలు ముందుగానే చెల్లించి పంటలు పండిస్తున్నారన్నారు. నూతన కౌలు చట్టం అమలు చేసి కౌలు రైతులందరికీ గ్రామసభల ద్వారా సీసీఆర్సీ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాధారణ రైతులకు వర్తించే అన్ని సౌకర్యాలతో పటు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చాలన్నారు. అనంతరం డిమాండ్ల కూడిన వినతి పత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, జిల్లా నాయకుడు వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కృష్ణమూర్తి, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విరూపాక్షి పాల్గొన్నారు.

● ధర వింటే దిమ్మ తిరిగిపోతోంది!



బక్రీద్ సీజన్లో పొట్టేళ్లకు భారీగా డిమాండ్ పెరిగింది. సాధారణంగా మాంసం కోసం పెంచే పొట్టేళ్లను.. వాటి బరువు ఆధారంగా ధర నిర్ణయిస్తారు. కానీ బక్రీద్ పండుగ నేపథ్యంలో విక్రయించే జీవాలకు బరువుతో పని లేదు. కేవలం రూపం, వాటి ఆరోగ్యాన్ని మాత్రమే చూస్తారు. దీంతో సాధారణ ధరల కన్నా ఏకంగా నాలుగు రెట్లు ఎక్కువకు పొట్టేళ్లు అమ్ముడు పోతున్నాయి. మాములు రోజుల్లో రూ.10 నుంచి రూ.15 వేలు పలికే పొట్టేళ్ల ధర.. బక్రీద్ డిమాండ్ కారణంగా రూ.30 నుంచి రూ.50 వేలకు పెరిగింది. వాడైన చూపులు.. మెలి తిరిగిన కొమ్ములు.. బలిష్టంగా ఉన్న పొట్టేళ్లు, మేకపోతుల ధర మరింత ఎక్కువగా ఉంటోంది. దిమ్మతిరిగేలా పెరిగిన ధరలతో పండుగ ఎలా చేసుకోవాలని ముస్లింలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – ఆత్మకూరు:







రూ.52 వేలకు విక్రయించిన పొట్టేలు, రూ.40 వేల నుంచి రూ.50 వేలతో అమ్ముడుపోతున్న పొట్టేళ్లు, మేకపోతు, రూ.30 వేలకు కొనుగోలు చేసిన పొట్టేలును చూపుతున్న ఆత్మకూరు వాసి

అన్నదాతకు రిక్తహస్తం!

- అన్నదాత సుఖీభవ పథకం అమలులో కనిపించని కష్టాలు
- సవాలక్ష నిబంధనలతో రైతుకు తప్పని తిప్పలు
- అర్హుల్లో చాలా మందికి రిక్తహస్తం చూపేలా కార్యచరణ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతు కష్టాలు రెట్టింపు అయ్యాయి. అన్నదాత సుఖీభవ పథకం అమలులో నిబంధనల తిరకాసు అన్నదాతలను తీరని ఇబ్బందులకు గురి చేస్తోంది. అధికారులు సైతం కొర్రీలతో ముప్పుతిప్పలు పెడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల పేరుతో సవాలక్ష సాకులు వెతికి అర్హుల్లో చాలా మందికి రిక్తహస్తం చూపేలా కార్యాచరణ చేపట్టారు.



విత్తు కోసం పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

రాయదుర్గం: అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు గత ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు ఇచ్చిన హామీ అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా.. బాలారిష్టాలను దాటి ముందుకు సాగడం లేదు. ఇప్పటికే అర్హులైన రైతుల ఎంపిక ప్రక్రియ పూర్తి కావస్తున్నట్లుగా అధికారులు చెబుతున్నా... పథకం లబ్ధి పొందేందుకు రైతులకు కొత్త చిక్కులు తప్పడం లేదు. గతంలో చేపట్టిన రీసర్వేను సాకుగా చూపి అర్హుల జాబితా నుంచి చాలా మందిని తొలగించేందుకు కూటమి సర్కార్ సిద్ధమైంది. ఈ కుట్ర కాస్త బహిర్గతం కావడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

చిక్కుముడులు విప్పకనే తుది జాబితా!

కేంద్ర ప్రభుత్వ పథకమైన పీఎం కిసాన్ యోజనతో కలిసి అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసేందుకు ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. పీఎం కిసాన్ యోజన కింద రూ.6 వేలతో పాటు మిగిలిన రూ.14 వేలను రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలను అందించనుంది. దీనికి వెబ్ల్యాండ్ను అనుసంధానిస్తూ పరిశీలన ప్రక్రియ చేపట్టాలని వ్యవసాయశాఖను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఇక్కడే అసలు చిక్కు మొదలవుతోంది. రీ-సర్వేల్లో భాగంగా కొందరు రైతుల ఆధార్, సెల్ నంబర్తో పాటు ఇతర వివరాలనూ అధికారుల నమోదు చేయకపోవడం, ఆన్లైన్లో భూములున్నా ఆధార్ అనుసంధానికి రెవెన్యూ అధికారులు చుక్కలు చూపడం లాంటి కారణాలు వెరసి తహసీల్దార్, వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ రైతులు నిత్యం తిరిగి వేసారి పోతున్నారు. వెబ్ల్యాండ్లో పరిశీలన ప్రక్రియ పూర్తి కావడంతో చాలా మంది రైతులు అనర్హులుగా మిగిలిపోయారు. డి.హీరేహాళ్ మండలంలో ఓ అధికారి నిర్వాహకంతో రైతుల కష్టాలు రెట్టింపు అయ్యాయి. వెబ్ల్యాండ్లోని చిక్కుముడులను విప్పకనే తుది జాబితాకు అధికారులు సిద్ధం కావడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఏడాదిగా ఇదే నాన్చుడు

గత వైఎస్సార్సీపీ హయాంలో ఖరీఫ్ ఆరంభానికి ముందే రైతు భరోసా పథకం కింద అర్హులైన ప్రతి రైతుకూ పెట్టుబడి సాయాన్ని అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి అందిస్తూ వచ్చారు. విత్తు నుంచి విపత్తుదాక వెన్నంటే నిలిచారు. ఏటా రెండు లక్షల మందికి పైగా రైతులకు రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఐదేళ్ల పాటు రైతులకు రూ.1879.29 కోట్ల సాయాన్ని అందించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని పేరు మార్చి అన్నదాత సుఖీభవ పథకంగా నామకరణం చేసి అమలులో ఏడాది పాటు నాన్చుడు ధోరణి అవలంభిస్తూ వచ్చింది. దీనిపై అన్నదాతల్లో అసహనం వ్యక్తం కావడంతో ఓ మెట్టు దిగి వచ్చిన కూటమి సర్కార్... పథకం అమలు పేరుతో కొర్రీలు విధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తోంది. జిల్లాలో 4.74 లక్షల మంది రైతులుండగా వీరిలో 2,98,535 మందికి అన్నదాత సుఖీభవ పథకం వర్తించాల్సి ఉంది.

జిల్లాలో అన్నదాత సుఖీభవ పరిశీలన ప్రక్రియ ఇలా

వెబ్ల్యాండ్లో నమోదైన రైతుల సంఖ్య	4,74,598
పరిశీలన పూర్తయినవి	4,59,670
రెవెన్యూ సమస్యలతో తహసీల్దార్ లాగిన్లో ఉన్నవి	7,150
వీటిలో ఇప్పటి వరకూ పరిష్కరించినవి	2,117
పెండింగ్లో ఉన్నవి	5,023

పరిశీలన చేస్తున్నాం

ఆన్లైన్లో వెబ్ల్యాండ్ ఆధారంగా రైతుల పరిశీలన చేపట్టాం. డి-పట్టా రైతుల పేర్లు ఆన్లైన్లో ఉన్నా పరిశీలనలో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇలాంటివి సరిచేసేందుకు చర్యలు తీసుకున్నాం. అర్హత కలిగిన రైతులందరికీ న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నాం.
– ఉమామహేశ్వరమ్మ, జేడీఏ, అనంతపురం

అభిప్రాయ సేకరణ చేపట్టాలి

- కలెక్టర్ వినోద్కుమార్ ఆదేశం



పోస్టర్ల విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్కుమార్, డీఆర్ఓ మలోల, సీపీఓ అశోక్కుమార్

అనంతపురం అర్బన్: జనాభా నిర్వహణ విధానం పాలసీపై క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయ సేకరణ పక్కగా చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో 'జనాభా నిర్వహణ విధానం, ప్రతి కుటుంబం ముఖ్యం, మీ అభిప్రాయం మార్గదర్శనం' పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించి, మాట్లాడారు. ఈ నెల 20వ తేదీ వరకు ప్రజల భాగస్వామ్య సంప్రదింపుతో అభిప్రాయ సేకరణ పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, సచివాలయ సిబ్బందికి తగిన సూచనలు అందజేసి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ ఎ.మలోల, సీపీఓ అశోక్కుమార్ పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

గుత్తి: పట్టణ నడిబొడ్డున చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి మండలం కొట్టాలపల్లికి చెందిన కార్తీక్ (24), శివరామిరెడ్డి గుత్తిలో గురువారం జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గుత్తిలోకి చేరుకోగానే యాడికి గ్రామానికి చెందిన బషీర్, రమేష్ వెళుతున్న మరో ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్నారు. దీంతో రోడ్డుపై కుడి వైపు పడిన కార్తీక్ను గమనించి లారీ డ్రైవర్ బ్రేక్ వేసే లోపు చక్రం దూసుకెళ్లడంతో తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. కార్తీక్ వెనుక బైక్పై కూర్చొన్న శివరామిరెడ్డి, మరో బైక్పై ఉన్న రమేష్, బషీర్ రోడ్డుకు ఎడమ వైపు పడటంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. చిన్నపాటి గాయాలతో వారు బయటపడ్డారు. మృతుడు బేల్దారి పనులతో కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

పోటీలకు కవితల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: ఈ నెల 16న విన్సెంట్ ఫెర్రర్ స్మారక కవితా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సామాజిక సేవా కార్యకర్త రవికాంత్ రమణ గురువారం పోస్టర్లను కొప్పల మీనాక్షమ్మ ఫౌండేషన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. తెలుగు వెలుగు సాహితీ సంస్థ టీవీరెడ్డి, ఆశ్రయ కృష్ణారెడ్డి, సంపాదకులు తోట నాగరాజు, లఘుచిత్రాల కెమెరామెన్ లింగాల పవన్ తదితరులు మాట్లాడారు. ఈనెల 16న విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా 'ఆర్డీటీ సేవలు- అభాగ్యులకు వరాలు' పేరిట కవితా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 10వ తేదీలోపు తమ కవితలను 73828 63523 నంబర్కు పంపాలన్నారు.

ఆర్ఎంపీ అనుమానాస్పద మృతి

- పెన్నహోబిలం గుట్టల్లో కాలిన మృతదేహం గుర్తింపు



మంజునాథ్రెడ్డి (ఫైల్)

ఉరవకొండ: ఓ ఆర్ఎంపీ అనుమానాస్పద స్థితిలో మృతదేహమై కనిపించాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఆత్మకూరు మండలం సిద్దారాంపురం గ్రామానికి చెందిన ఆవుల గోపాలరెడ్డి, సువర్ణమ్మ దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు మంజునాథ్రెడ్డి ఉన్నారు. కుమారుడు గ్రామంలోనే ఆర్ఎంపీగా గ్రామస్తులకు వైద్య సేవలు అందిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడేళ్ల క్రితం తండ్రి మృతి చెందాడు. అప్పటి నుంచి కుటుంబ పోషణ భారం మంజునాథరెడ్డి (30)పై పడింది. కుమార్తెకు వివాహం కావడంతో కుమారుడికి పెళ్లి చేయాలని తల్లి సంబంధాలు చూస్తోంది. అయితే సంబంధాలు ఏవీ కుదరకపోవడంతో పాటు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులతో చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక జీవితంపై విరక్తి పెంచుకున్న మంజునాథ్ ఈ నెల 4న ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో ఈ నెల 5న కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం ఉరవకొండ మండలం పెన్నహోబిలం గుట్టల్లో కాలిపోయిన ఓ మృతదేహాన్ని గమనించిన స్థానికుల సమాచారంతో సీఐ మహానంది, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. పెన్నహోబిలంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం ఆధారంగా మృతుడిని మంజునాథ్గా అనుమానిస్తూ సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ నేతల ఇళ్ల వద్ద విత్తన కాయల రిజిస్ట్రేషన్!

బుక్కరాయసముద్రం: మండలంలోని చెన్నంపల్లిలో టీడీపీ నేతలు చెప్పిన ఇళ్ల వద్ద వ్యవసాయ సిబ్బంది కూర్చొని విత్తన కాయల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారని వైఎస్సార్సీపీ నాయకులు వెంకటరెడ్డి ఆరోపించారు. గ్రామంలో సచివాలయం ఉండగా వ్యవసాయ అధికారులు టీడీపీ నేతలు చెప్పిన చోట రిజిస్ట్రేషన్లు చేపట్టడం దారుణమన్నారు. సచివాలయంలోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టి విత్తన పంపిణీని పారదర్శకంగా చేపట్టాలని కోరారు.

బ్రెయిన్ డెడ్ బాలుడి అవయవ దానం



శ్రీహరి (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: బ్రెయిన్ డెడ్ అయిన ఓ బాలుడి అవయవాలను అతడి తల్లిదండ్రులు దానం చేశారు. మృతిచెందిన తర్వాత తమ కుమారుడు మరికొంత మంది జీవితాల్లో వెలుగులు నింపుతాడనే భావంతో పుట్టెడు దుఃఖాన్ని దిగమింగి మరీ అవయవదానానికి అంగీకరించారు. వివరాలిలా ఉన్నాయి... కళ్యాణదుర్గం మండలం గరుడాపురం – కొత్తూరు గ్రామాల మధ్య మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. తలకు తీవ్ర గాయమై అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీహరి (18) బ్రెయిన్ డెడ్ అయినట్లు గురువారం వైద్యులు నిర్ధారించారు. దీంతో అతడి తల్లిదండ్రులు అనసూయమ్మ, ఈరన్న, సోదరి సింధూజ, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న జీవన్ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులు... శ్రీహరి అవయవాలను దానం చేస్తే కొంతమందికి ప్రాణదానం చేయవచ్చని తల్లిదండ్రుల వద్ద ప్రస్తావించడంతో అంతటి దుఃఖంలోనూ వారు అంగీకారం తెలిపారు. దీంతో శ్రీహరి గుండె, కళ్లు, కిడ్నీలను జీవన్దాన్ ప్రతినిధులు సేకరించి అత్యవసరమైన రోగుల కోసం మెట్రో నగరాల్లోని ఆస్పత్రులకు తరలించారు. కాగా, ఇంటర్ వరకూ చదువుకున్న శ్రీహరి... కొత్తూరు గ్రామంలోనే తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో చేదోడుగా ఉండేవాడు. అవయవ దానం చేసేందుకు అంగీకరించిన శ్రీహరి తల్లిదండ్రులను వైద్య సిబ్బంది అభినందించారు.

ముగిసిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు



సాధించిన పతకాలను చూపుతున్న విజేతలు

తాడిపత్రి టౌన్: స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో గురువారం తైక్వాండో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్రెడ్డి విజేతలకు బహుమతులు అందజేసారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ రాష్ట్ర స్థాయి చాంపియన్షిప్ పోటీలు తాడిపత్రిలోని సత్యసాయి ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు తైక్వాండో సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య తెలిపారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల కరస్పాండెంట్ సతీష్రెడ్డి, నీలకంఠారెడ్డి పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి



మృతుడు లింగారెడ్డి

రాప్తాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం రామినేపల్లి గ్రామానికి చెందిన బుంగ లింగారెడ్డి (75), అదే గ్రామానికి చెందిన హరిజన సాకే వెంకటరమణ ద్రాక్ష కొమ్మల కటింగ్ పనితో కుటుంబాలను పోషించుకుంటున్నారు. రామినేపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై రాప్తాడు వద్ద ఉన్న పెట్రోలు బంక్ వద్దకు చేరుకుని అక్కడ తమ వాహనాలను నిలిపి మిగిలిన కూలీలతో కలసి ఆటోలో ద్రాక్ష తోటలకు వెళ్లి పనులు ముగించుకుని వచ్చేవారు. ఈ నేపథ్యంలో గురువారం గార్లదిన్నె వద్ద ద్రాక్ష కటింగ్కు వెళ్లాల్సి ఉండడంతో తన స్కూటీపై సాకే వెంకటరమణతో కలసి లింగారెడ్డి బయలుదేరాడు. తెల్లవారుజామున 5.15 గంటలకు రాప్తాడు సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఉన్న ఐచర్ షోరూమ్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి అతి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో బుంగ లింగారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ తన వాహనంతో సహా ఉడాయించాడు. తీవ్రంగా గాయపడిన సాకే వెంకటరమణను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా, బుంగ లింగారెడ్డికి భార్య లక్ష్మీదేవి, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు.

ప్రైవేట్ వాహనదారుల ఘర్షణ



ప్రైవేట్ వాహనాన్ని ఉరవకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద అడ్డుకుంటున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక టీడీపీ ముఖ్యనేత ఆశీస్సులతో కూడేరు మండలానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు ఏడాదిగా అనంతపురం – ఉరవకొండ మార్గంలో అనధికార షటిల్ సర్వీసులు నడుపుతూ ప్రయాణికులను దోచుకుంటున్నారని లైట్ మోటార్ వెహికల్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మండిపడ్డారు. గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రైవేట్ వాహనాలను అసోసియేషన్ సభ్యులు అడ్డుకున్నారు. ఆ సమయంలో ఇరు వర్గాల వాగ్వాదం చెలరేగి ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. అప్పులు చేసి, బంగారం కుదవ పెట్టి దాదాపు 150 మంది వాహనాలను కొనుగోలు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. తాము మూడు నెలలకు రూ.8.960 రోడ్ ట్యాక్స్ కట్టి, ఈఎంఐలు చెల్లిస్తున్నామన్నారు. టీడీపీ నేతల వాహనాలు కాదని ఇతరుల వాహనంలో ప్రయాణికులు ఎక్కబోతే దౌర్జన్యం చేస్తున్నారన్నారు. చివరకు ఆటోల్లో సైతం ప్రయాణికులను అనుమతించడం లేదన్నారు. తమతో పాటు గవిమఠంలోని వాహన స్టాండ్లో వాహనాలు పెట్టి క్రమ పద్ధతిలో బాడుగకు తిప్పుకుంటే అభ్యంతరం లేదన్నారు. అలా కాదని ఆర్టీసీ బస్టాండ్ వద్ద పెట్టి దోపిడీ చేయాలనుకుంటే సహించేది లేదని తేల్చి చెప్పారు. దీనిపై ఇప్పటికైనా ఆర్టీసీ, ఆర్టీఓ అధికారులు మేల్కొని చర్యలు చేపట్టాలని కోరారు.

వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాజు అరెస్ట్

తాడిపత్రి టౌన్: సజ్జలదిన్నె గ్రామంలో గత నెల 7న జరిగిన దాడిలో రంగయ్య, వేణుగోపాలరెడ్డి గాయపడిన విషయం తెలిసిందే. ఈ కేసులో గురువారం సజ్జలదిన్నె గ్రామానికి చెందిన ఒంటెద్దు రాజగోపాలరెడ్డి, తలారి రామచంద్రను అరెస్టు చేసినట్లు సీఐ శివగంగాధర్రెడ్డి తెలిపారు. అలాగే అదే రోజు గణేష్, బాలయ్య గాయపడిన కేసులో సజ్జలదిన్నె గ్రామానికి చెందిన రాజు, పసలూరు ఓబులేసును అరెస్ట్ చేసి రిమాండ్కు పంపినట్లు సీఐ వెల్లడించారు. కాగా, ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకున్న టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి తాడిపత్రిలో రెడ్బుక్ రాజ్యాంగాన్ని పోలీసులు సైతం పక్కాగా అమలు చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఇన్నాళ్లూ తాడిపత్రికి రాకుండా అడ్డుకున్న నేతలు.. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలతో పెద్దారెడ్డి తాడిపత్రికి వచ్చేందుకు సిద్ధం కాగా, అక్రమ అరెస్టుల పర్వానికి తెరలేపడమే ఇందుకు నిదర్శనమంటున్నారు. ఇప్పటికే తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్రెడ్డి ప్రోద్బలంతో ఆయా మండలాల్లో వైఎస్సార్సీపీ నాయకులపై పోలీసులు తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. ఈ క్రమంలోనే గత నెల 7న తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామంలో వైఎస్సార్సీపీ నాయకులను టీడీపీ నాయకులు సుమోలో వెంటాడి దాడి చేయగా.. బాధితుల ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసిన పోలీసులు... అలాగే టీడీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కౌంటర్ కేసు కూడా నమోదు చేశారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజును బుధవారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. అలాగే పెద్దపప్పూరు మండలం తిమ్మనచెరువు గ్రామానికి చెందిన కేతిరెడ్డి పెద్దారెడ్డి మరో ముఖ్య అనుచరుడు వేమనాథరెడ్డి, మరో 11 మందిపై కేసు నమోదు చేశారు.

● ఈ కలయికకు 50 ఏళ్లు!



యాడికి: మండలంలోని రాయలచెరువులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1974–75 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారిలో 21 మంది అదే పాఠశాల వేదికగా గురువారం కలుసుకున్నారు. 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఒకరి కష్టసుఖాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు తమకు విద్యాబుద్ధులు నేర్పి మృతి చెందిన నాటి గురువులు, తమ ఐదుగురు స్నేహితులకు నివాళులర్పించారు. అనంతరం పూర్వ విద్యార్థి నాగరంగయ్య మాట్లాడుతూ.. రాయలచెరువులోని నం.1 ప్రాథమికోన్నత పాఠశాలలో 9వ తరగతి వరకు చదువుకోగా... 1974లో పాఠశాలను ఉన్నత పాఠశాల అప్గ్రేడ్ చేయడంతో తాము మొదటి బ్యాచ్ విద్యార్థులుగా పాఠశాల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు నాగరంగయ్య, శివప్రసాద్, సత్యరంగయ్య, విశ్వనాథ్, శ్రీనివాసులు, రామకృష్ణ నేతృత్వం వహించగా ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు డేనియల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

క్లుప్తంగా

నేడు రాప్తాడులో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ క్యాంపు

అనంతపురం టౌన్: ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటు అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు రాప్తాడులోని వెలుగు కార్యాలయంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాసయాదవ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌లో భాగస్వాములు కావాలని కోరారు.

నేడు వినాయక విగ్రహ ప్రతిష్ట

అనంతపురం కల్చరల్: నగరంలోని లలితకళా పరిషత్ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయంలో శుక్రవారం వినాయకుడి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తున్నట్లు ఎల్కేపీ కార్యదర్శి పద్మజ తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఎల్కేపీలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శుక్రవారం జరిగే విగ్రహ ప్రతిష్టలో అందరూ పాల్గొనాలని కోరారు.

విద్యుత్ శాఖకు స్కై లిఫ్ట్ క్రేన్


స్కై లిఫ్ట్‌తో విద్యుత్ శాఖ ఉద్యోగులు

అనంతపురం టౌన్: విద్యుత్ శాఖకు స్కై లిఫ్ట్ క్రేన్ మంజూరు చేసినట్లు విద్యుత్ శాఖ సీఈ వరకుమార్ తెలిపారు. గురువారం ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ శేషాద్రి శేఖర్‌తో కలిసి స్కై లిఫ్ట్ క్రేన్‌ను ప్రారంభించారు. అనంతపురం నగరంలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను సులువుగా తొలగించే విధంగా రూ.36 లక్షలతో ఈ క్రేన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

'కౌసల్య కృషి అభినందనీయం'

అనంతపురం కల్చరల్: పిల్లలకు డ్యాన్సుపై శిక్షణ ఇవ్వడమే కాకుండా వారిలో నైతిక విలువలను పెంచుతున్న నాట్యాచార్యులు దేవరకొండ కౌసల్య కృషి అభినందనీయమని వక్తలు అన్నారు. గురువారం స్థానిక సోమనాథ నగర్ వేదికగా టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా సాగిన సనాతన సమ్మర్ క్యాంపు ముగింపు వేడుకల్లో స్వామి వినోద్, వీఆర్వోలు సుబ్రమణ్యం, శ్రీధరస్వామి, పంచాంగం సుబ్బలక్ష్మి తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం చిన్నారులకు మనం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ చక్రవర్తి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలనందించారు.

నివాళి


సతీష్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 4వ రోడ్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు సతీష్‌రెడ్డి గురువారం గుండెపోటుతో ఆకస్మిక మరణం పొందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సతీష్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



కనగానపల్లి: మండల కేంద్రమైన కనగానపల్లిలో గురువారం అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆలయంలో గత రెండు రోజుల నుంచి వేద పండితులు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మూడోరోజు గురువారం వేకువజామున అయ్యప్ప విగ్రహాన్ని వేద మంత్రోచ్ఛరణలతో గర్భ గుడిలో ప్రతిష్ఠించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతపురం: అనంతపురం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నడిమి వంక దగ్గర మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి (55) అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందాడు. గొర్రెల వ్యాపారస్తులతో మాట్లాడుతూ ఉన్నట్లుండి కింద పడి చనిపోయాడు. సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో సహజ మరణం అని నిర్ధారించినట్లు త్రీ టౌన్ సీఐ కే. శాంతిలాల్ తెలిపారు. మృతుడి అడ్రస్ తెలిస్తే త్రీ టౌన్ సీఐ 9490618679 నెంబరుకు ఫోన్ చేసి తెలిపాలని కోరారు.

మౌలిక సదుపాయాలు మృగ్యం

- జిల్లాలో కనిపించని కోవిడ్ ముందస్తు చర్యలు
- ఆర్‌టీపీసీఆర్ కిట్ల కొరత
- పని చేయని వెంటిలేటర్లు


సర్వజనాస్పత్రిలో మూలకుపడేసిన వెంటిలేటర్లు


అధ్వానంగా ఉన్న కోవిడ్ ఐసోలేషన్ వార్డు

అనంతపురం మెడికల్: కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మౌలిక సదుపాయాలు మృగ్యంగా మారాయి. ప్రధానంగా కోవిడ్ పాజిటివ్ కేసులు రాష్ట్ర వ్యాప్తంగా పెరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో తొలి కోవిడ్ కేసు నిర్ధారణ అయ్యింది. అయినా, ఇప్పటి వరకు జిల్లా అధికార యంత్రాంగం ఎటువంటి ముందస్తు చర్యలు తీసుకోలేదు. కనీసం మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో కోవిడ్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకుని వెంటిలేటర్లు, పల్స్ ఆక్సీ మీటర్లు, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, క్వారన్‌టైన్ సెంటర్లు, ఐసోలేషన్, తదితర వార్డులను ఏర్పాటు చేశారు.

58 వెంటిలేటర్లే గతి..

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మొత్తం 220 వెంటిలేటర్లు ఉంటే అందులో 58 మాత్రమే పని చేస్తున్నాయి. మిగితావి మరమ్మతుకు నోచుకోలేదు. ఆక్సిజన్ కాన్‌సెన్‌ట్రేటర్లు అందుబాటులో ఉన్నాయి. ఆర్‌టీపీసీఆర్ పరీక్షలపై నీలినీడలు కమ్ముకున్నాయి. బోధనాస్పత్రిలో ఆర్‌టీపీసీఆర్ కిట్లు లేవు. వాటి ద్వారా 6 నుంచి 8 గంటల వ్యవధిలో వ్యాధి ఫలితాలు వస్తాయి. ఒక్కసారి 94 మందికి పరీక్ష చేయవచ్చు. ఆ విధంగా 24 గంటల వ్యవధిలో 800 నుంచి 900 మంది వరకు పరీక్షలు చేయవచ్చు. ప్రైవేట్‌గా వీటి నిర్ధారణ చేసుకోవాలంటే రూ.2,000 వరకు ఖర్చు అవుతుంది. ఇప్పుడు అటువంటి పరీక్షలు బయట చేయడం లేదు. ప్రస్తుతం ర్యాపిడ్ యాంటీ జెన్ పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. ఆ కిట్లు 50 కంటే ఎక్కువ లేవు. కోవిడ్ అతివేగంగా వ్యాప్తి చెందుతున్న ప్రస్తుత తరుణంలో జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అధ్వానంగా ఈఎన్‌టీ ఐసోలేషన్:

సర్వజనాస్పత్రిలోని ఈఎన్‌టీ వార్డులో 28 పడకలతో కోవిడ్ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు చేసినా.. ఆ వార్డు అధ్వానంగా ఉంది. ఎటువంటి సురక్షిత ప్రమాణాలు లేవు. వార్డును చూస్తే ఏదో పాడుబడ్డ భవనంలా కన్పిస్తుంది. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం మేలుకుని తగు చర్యలు తీసుకుంటుందో లేదో వేచి చూడాలి.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలి


వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో యువత పాత్ర ఎంతో కీలకమని, రానున్న రోజుల్లో పార్టీ పటిష్టతకు సైనికుల్లా పని చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతీనాయుడులు పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని దాడులు, దౌర్జన్యాలు, అక్రమ అరెస్టులకు పాల్పడుతోందన్నారు. ఇటువంటి తరుణంలో యువజన విభాగం క్రియాశీలకంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ యువజన విభాగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు.మారుతీనాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం దుశ్చర్యలను తిప్పికొడతామన్నారు. అనంతరం యువజన విభాగం నగర కార్యదర్శి రంగారెడ్డి, వలంటీర్ విభాగం నగర కార్యదర్శి జగపతిబాబు, మైనార్టీ విభాగం జిల్లా కార్యదర్శి బుడేన్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం


విద్యార్థులకు బహుమతులు అందించిన దృశ్యం

రాప్తాడు: వేసవి శిక్షణ శిబిరాలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని సర్పంచు సాకే తిరుపాల్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో 40 రోజులుగా జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసినట్లు గ్రంథాలయాధికారి వీరనారాయణరెడ్డి తెలిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. సాకే తిరుపాల్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు మంచి విజ్ఞానవేత్తగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు, ఆదినారాయణ, బుల్లే నాగన్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గత 40 రోజులుగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసినట్లు గ్రంథాలయ అధికారి జయరాం తెలిపారు. విద్యార్థులకు స్పోకన్ ఇంగ్లిష్ , డ్రాయింగ్, గణితం, తెలుగు వ్యాకరణం, యోగా, పుస్తక పఠనం, క్విజ్ పోటీలను నిర్వహించామన్నారు. ఇందులో గెలిచిన వారికి బహుమతులను అందించినట్లు పేర్కొన్నారు.

'ఏబీసీ'పై అవగాహన

అనంతపురం: అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్ (ఏబీసీ), జాతీయ అకడమిక్ డిపాజిటరీ (ఎన్ఏడీ), అపార్ ఐడీ సృష్టి, క్రెడిట్ డేటా సీడింగ్‌పై ఉన్నత విద్యామండలి అధికారులు అవగాహన కల్పించారు. జేఎన్‌టీయూ అనంతపురం పాలక భవనంలో ఉన్నత విద్యామండలి అధికారులు నిర్వహించిన కార్యక్రమానికి పది వర్సిటీల నుంచి ఆయా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. నూతన జాతీయ విద్యా విధానం -2020 అమలు ప్రత్యేక ఎజెండాగా చేర్చుకుని వివిధ అంశాలపై అవగాహన చేపట్టారు.

మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలి


అనంతపురంలోని జెడ్పీ ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న బోయ గిరిజమ్మ


మొక్కలు నాటి నీరు పోస్తున్న కమిషనర్ బాలస్వామి


అనంతపురం సర్వజనాస్పత్రి ఆవరణలో మొక్కలు నాటిన సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు

అనంతపురం సిటీ: ఊరూరా, వాడవాడలా మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని ఉభయ జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో సీఈఓ వెంకటసుబ్బయ్య, జెడ్పీ ఉద్యోగులతో కలసి గురువారం ఆమె మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా గిరిజమ్మ మాట్లాడుతూ.. మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగానే కాకుండా వ్యక్తిగత బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలన్నారు. ఇళ్లు, కార్యాలయాలు, ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. మొక్కలు నాటి సంరక్షించడమే కాకుండా, ఉన్న చెట్లనూ కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీఈఓ వెంకటసుబ్బయ్య అన్నారు. జూన్ 5 పర్యావరణ దినోత్సవం రోజు నుంచి వచ్చే కార్తీక మాసం వరకు వర్షాలు విరివిగా కురిసే సీజన్ కావడంతో అందరూ తలా ఒక్క మొక్క చొప్పున నాటి పరిసరాలను పచ్చదనంతో నింపాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ప్రతిజ్ఞ చేయించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

అనంతపురం కార్పొరేషన్: మొక్కలు నాటడమే కాకుండా వాటిని పరిరక్షించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదామని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కమిషనర్ చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో దాదాపుగా 2 వేల మొక్కలు నాటేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఒక్కొక్కరు ఒక్కో మొక్కను దత్తత తీసుకుని సంరక్షించాలని సూచించారు.

ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగిద్దాం

నిషేధిత ప్లాస్టిక్‌ను ఎవరూ వాడకూడదని, నగర ప్రజలు సామాజిక బాధ్యతగా ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఇతర వస్తువులను వినియోగించాలని నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పిలుపునిచ్చారు. గురువారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కమిషనర్ పరిశీలించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం

అనంతపురం టౌన్: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకుందామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజినీర్ మునిప్రసాద్ పిలుపు నిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తెలుగుతల్లి విగ్రహం నుంచి క్లాక్ టవర్ వరకు గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు సామాజిక సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకుందాం

అనంతపురం టౌన్: మొక్కలను విరివిగా నాటి ప్రకృతిని కాపాడుకుందామని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రిశేఖర్ పిలుపు నిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం విద్యుత్ కార్యాలయంలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం కాలుష్యకాసారంగా మారిపోతోందన్నారు.

ఎస్కేయూలో..

అనంతపురం: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనిత అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 100 మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ ఏడాదిలో మొత్తం 2,300 మొక్కలను నాటి, సంరక్షించామని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

అనంతపురం మెడికల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రి వెనుక వైపు ఉన్న కంపోస్టు యార్డును శుభ్రం చేసి మొక్కలు నాటేలా సూపరింటెండెంట్ చర్యలు తీసుకున్నారు.

ఆకట్టుకున్న స్టాళ్లు

చెన్నేకొత్తపల్లి: మొక్కలు నాటి వాటిని పరిరక్షించి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మండల కేంద్రానికి సమీపంలోని టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ సంస్థ వ్యవస్థాపకులు బబ్లూ గంగూలీ, మేరివటమట్టమ్, ఎంపీడీఓ బాలకృష్ణుడు హాజరయ్యారు.

కనగానపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీదేవి తెలిపారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. తగరకుంట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేకాధికారితో పాటు పలువురు మండలాధికారులు, ఉపాధిహామి సిబ్బందితో కలసి మొక్కలు నాటారు.

ప్లాస్టిక్ కాలుష్య నివారణకు ప్రతిజ్ఞ చేద్దాం

కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపు

అనంతపురం అర్బన్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారిద్దామంటూ ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేద్దామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టేందుకు చర్యలు ప్రారంభిస్తామన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ తన సందేశాన్ని అందించారు. పర్యావరణాన్ని పరిరక్షించి భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మానవాళికి అనర్థదాయకంగా మారిన ప్లాస్టిక్‌ను ప్రతి ఒక్కరూ తమ వంతుగా నిషేధించాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎవరూ బొకేలు ఇవ్వకుండా పువ్వులు, మొక్కలు అందించాలన్నారు. సమావేశాలకు హాజరయ్యే సమయంలో అధికారులు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ వాడుతున్నారని, ఇకపై ఎవరికి వారు సొంతంగా స్టీల్ లేదా కాపర్ బాటిళ్లలో నీటిని తెచ్చుకోవాలని సూచించారు. అన్ని రకాల ప్లాస్టిక్ వాడకాన్ని దశల వారీగా నిర్మూలిస్తామన్నారు. ప్లాస్టిర్ రహిత జీవన విధానాన్ని అందరూ అలవర్చుకోవాలని కోరారు.

మత సామరస్యంతో పండుగ జరుపుకోవాలి

అనంతపురం: బక్రీదు పండుగను మత సామరస్యంగా , ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ పి. జగదీష్ విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆయా మత పెద్దలతో గురువారం ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ముస్లిం మత పెద్దలతో ముఖాముఖి మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలుసుకుని పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతపురం జిల్లా మత సామరస్యానికి ప్రతీక అని.. జూన్ 07వ తేదీ బక్రీద్ పండుగను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంతోషంగా జరుపుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. బక్రీదు పండుగను అన్ని మతాల వారు పరస్పరం సహకరించుకుని సోదర భావంతో జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు.

పండుగ ప్రశాంతంగా జరుపుకోండి

రాప్తాడు రూరల్: బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ శేఖర్ ముస్లిం మత పెద్దలకు సూచించారు. గురువారం సాయంత్రం వారు అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. పలు అంశాలపై చర్చించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కల్యాణం.. కమనీయం



అనంతపురం కల్చరల్: పాపహరణ దశమి సందర్భంగా గురువారం తపోవనంలోని శివ శక్తి బాబా మందిరంలో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. స్వాతి నక్షత్రం కూడా కలిసి రావడంతో సాయిట్రస్టు వారు ఉదయం శివపార్వతులకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం అనంతరం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త మణూరు నాగరాజు పాపహరణ దశమి విశిష్టతను వివరించారు.

శ్రీక్షేత్రంలో...


కల్యాణోత్సవం జరిపిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: తపోవనంలోని శ్రీక్షేత్రంలో రెండురోజులుగా సాగుతున్న దశమ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ మాజీ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ ఆధ్వర్యంలో తీర్థప్రసాద వితరణ జరిగింది.

నేడు నగరానికి కరిబసవ రాజేంద్ర స్వామి

నగరంలోని అరవిందనగర్ సర్వేశ్వరాలయంలో శుక్రవారం జరిగే శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని జరిపించేందుకు గవిమఠం పీఠాధిపతి డాక్టర్ కరిబసవ రాజేంద్ర స్వామి నగరానికి విచ్చేయనున్నారు. అందులో భాగంగా రెండురోజుల పాటు సాగే ఉత్సవాల్లో గురువారం ఆలయంలో సర్వేశ్వరునికి అభిషేకాలు, హోమం జరిగాయి.

100 బారికేడ్లు అందజేత

అనంతపురం: ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణలో బారికేడ్ల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ పి. జగదీష్ అన్నారు. అనంతపురం కిమ్స్-సవీరా ఆసుపత్రి యాజమాన్యం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద 100 బారికేడ్లను జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో జిల్లా ఎస్పీ పి. జగదీష్‌కు అందజేశారు. అనంతరం కిమ్స్ సవీరా సీఓఓ సిద్దారెడ్డిని జిల్లా ఎస్పీ అభినందిస్తూ సన్మానం చేశారు. కార్యక్రమంలో సవీరా సీఓఓ సిద్దారెడ్డి, సీనియర్ మేనేజర్ రాఘవేంద్ర ప్రసాద్, అనంతపురం డీఎస్పీ వి. శ్రీనివాస రావు, సీఐలు రాజేంద్రనాథ్ యాదవ్, వెంకటేశ్ నాయక్, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

ఢిల్లీ పర్యావరణ సదస్సులో మేయర్ వసీం


ఢిల్లీలో జరిగిన పర్యావరణ సదస్సులో పాల్గొన్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఢిల్లీలో జరిగిన సదస్సులో మేయర్ వసీం పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం' అనే థీమ్‌పై సదస్సు జరిగిందని మేయర్ పేర్కొన్నారు. దేశంలోని వివిధ నగరాల్లో చేపట్టిన కార్యక్రమాల గురించి వివిధ ప్రాంతాల్లోని వక్తలు, ప్రతినిధులు వివరించినట్లు మేయర్ తెలిపారు.

స్టాఫ్‌నర్సుల జీతాలు నిలిపివేత

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రౌండ్ ద క్లాక్ సేవలందించే స్టాఫ్‌నర్సులపై ఉన్నతాధికారులు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. ఇప్పటికే వారికి డ్రెసింగ్ రూం తదితర కనీస అవసరాలను విస్మరించారు. ఈ ఏడాది జనవరిలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఒక్కరికి కూడా ప్రశంసా పత్రాన్ని అందించకుండా చిన్నచూపు చూశారు. తాజాగా వారి హక్కులను కాలరాసేలా నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సర్వజనాస్పత్రిలో విధులు నిర్వర్తించే 9 మంది స్టాఫ్ నర్సులు గత నెల 12 నుంచి ఎర్న్ లీవ్ (ఈఎల్) తీసుకున్నారు. ఈ క్రమంలో వీరి జీతాలను ఆపాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆస్పత్రిలో గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి చోటు చేసుకోలేదని, రోగులకు మెరుగైన సేవలందించే వారి నెల జీతాన్ని ఆపడం సరికాదని ఆస్పత్రి వర్గాలంటున్నాయి. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ జోక్యం చేసుకుని భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితి లేకుండా చూస్తారో లేదో చూడాలి.

సంక్షిప్త సమాచారం

హెడ్‌నర్సుల విధుల్లో మార్పు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రుల్లో విధులు నిర్వర్తించే హెడ్‌నర్సుల విధుల్లో మార్పు చేస్తూ డీఎంఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి షిఫ్టుల్లో స్టాఫ్‌నర్సులను పర్యవేక్షించాల్సిన బాధ్యత హెడ్‌నర్సులకు ఉంది. ప్రస్తుతం స్టాఫ్‌నర్సుల కొరత ఉండడంతో హెడ్‌నర్సుల విధులు రాత్రి వేళ పొడిగించారు. గతంలో రాత్రి వేళలో కేవలం ఇద్దరు హెడ్ నర్సులే పర్యవేక్షించే వారు. ఇప్పుడు మొత్తం ఏడుగురు హెడ్‌నర్సులు పర్యవేక్షించాల్సి వస్తుంది. ప్రస్తుతం సర్వజనాస్పత్రిలో నూతన విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు. గతంలో హెడ్‌నర్సులకు రాత్రి వేళల్లో విధులు తక్కువగా ఉండేది. స్టాఫ్‌నర్సులపైనే అధిక భారం పడేది. ఇప్పుడటువంటి పరిస్థితి లేకుండా డీఎంఈ తగు చర్యలకు ఉపక్రమించారు. సర్వజనాస్పత్రిలో మొత్తం 43 మంది హెడ్‌నర్సులున్నారు.

సబ్సిడీ విత్తనాలకు పేర్ల నమోదు

చెన్నేకొత్తపల్లి: ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసుకొనే రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేయనుంది. ఇందుకోసం రైతులు తమ పేర్లను వారి గ్రామ పంచాయతీ కేంద్రాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను నమోదు చేయించుకున్నట్లు మండల వ్యవసాయాధికారి ఉదయ్ కుమార్ తెలిపారు. వేరుశనగ కావాల్సిన రైతులు పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. జిల్లా అధికారులు తేదీలను ప్రకటించిన వెంటనే పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటిదాకా 264 మంది రైతులు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వైస్ ప్రిన్సిపాల్‌గా మునినారాయణప్ప

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నూతన వైస్ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ముని నారాయణప్ప నియమితులయ్యారు. ఎస్కేయూలో గ్రామీణాభివృద్ధి విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన వైస్ ప్రిన్సిపాల్‌తో పాటు వార్డెన్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెక్టార్ ప్రొఫెసర్ జి. వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆంజనేయులు, ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ తదితరులు అభినందించారు.